క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప మకరజ్యోతి పూజలు



అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

మార్కాపురం టౌన్: అయ్యప్ప స్వామి మకరజ్యోతి దర్శనం సందర్భంగా మార్కాపురం పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ అర్చకుడు రాఘవశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం రాత్రి ఆలయంలో టీవీలు ఏర్పాటు చేసి మకరజ్యోతి దర్శనాన్ని కల్పించారు. ఆలయ అధ్యక్ష్య కార్యదర్శులు టీజీ మల్లికార్జునరావు, పి.కృష్ణయ్య, కోశాధికారి మోహన్‌రావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైవీని, బూచేపల్లిని కలిసిన అన్నా కృష్ణచైతన్య



వైవీ సుబ్బారెడ్డిని, బూచేపల్లిని కలిసిన అన్నా కృష్ణచైతన్య

మార్కాపురం: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఒంగోలులోని ఎంపీ నివాసంలో పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తనయుడు కృష్ణచైతన్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కాపురంలో పలు విషయాలపై చర్చించారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేత



నిత్యావసరవస్తువులు అందజేస్తున్న సత్యనారాయణ

గిద్దలూరు రూరల్: సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని పీఆర్ కాలనీలో గల సంజీవిని వృద్ధాశ్రమానికి బుధవారం ఎల్‌ఐసీ ఏజెంట్, వైఎస్సార్ సీపీ నాయకుడు కోటా సత్యనారాయణ నిత్యావసర వస్తువులు అందజేశారు. బియ్యం, కంది పప్పు, నూనె ప్యాకెట్లు తదితర నిత్యావసర వస్తువులు అందజేసిన దాతకు నిర్వాహకుడు ఒ.రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

నిలిచిన రామయోగిస్వామి తిరునాళ్ల

● రైతు మృతి చెందడమే కారణం



పొదిలి రూరల్: మండలంలోని సూదనగుంట, జువ్వలేరు గ్రామాల్లో బుధవారం వైభవంగా నిర్వహించాల్సిన రామయోగి స్వామి తిరునాళ్ల అనూహ్య పరిణామంతో నిలిచింది. మంగళవారం జువ్వలేరు గ్రామానికి చెందిన రైతు వెన్నపూస శివారెడ్డి విద్యుదాఘాతంతో మృతి చెందడంతో రెండు గ్రామాల పెద్దలు తిరునాళ్ల ఆపాలని నిర్ణయించారు.

ముగ్గుల పోటీలు ఆపేందుకు కుట్ర

● ముగ్గురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసు నమోదు

పొదిలి రూరల్: అధికారం అండ చూసుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలు చెలరేగిపోతున్నారు. పొదిలి మండలంలోని కాటూరివారిపాలెంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా భోగి రోజు జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మరునాడు అదే ప్రాంతంలో ఒక చోట వైఎస్సార్ సీపీ, మరో చోట టీడీపీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వంలో ఉన్న పార్టీల కంటే వైఎస్సార్ సీపీ వారు మంచి బహుమతులు ఇస్తున్నారని తెలుసుకుని ఎలాగైనా పోటీలను ఆపాలని నిర్ణయించుకున్నారు. ఉద్దేశపూర్వకంగా సమస్య సృష్టించడమే కాకుండా చొక్కా పట్టుకుని కొట్టారంటూ టీడీపీ కార్యకర్త రాయపాటి ప్రతాప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో పోలీసులు కాటూరి ప్రసాద్, కాటూరి అశోక్, బోడపాటి అశోక్‌పై కేసు నమోదు చేశారు.

ఊరూవాడా సంబరం

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే పర్వదినం సంక్రాంతిని మూడు రోజులపాటు గ్రామీణ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మంగళ, బుధవారాల్లో ప్రజలు తమ ఇష్టదైవాలకు నైవేద్యాలు సమర్పించి, పూజలు చేశారు. రైతన్నలు తమ ఎడ్లను పూజించారు. పలు గ్రామాల్లో యువత వాలీబాల్ పోటీలు, కబడ్డీ పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్న పిల్లలు పతంగులు ఎగురవేసి సందడి చేశారు.

- శోభాయమానం.. సంక్రాంతి వేడుకలు...
- సంక్రాంతికి బంధుమిత్రులతో సందడిగా మారిన పల్లెలు
- రంగవల్లులతో కళకళలాడిన వీధులు
- కనుమ రోజు ఉత్సాహంగా సాగిన పార్వేట ఉత్సవాలు

మార్కాపురం టౌన్: సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి పార్వేట ఉత్సవం మంగళవారం వైభవంగా సాగింది. చెన్నకేశవస్వామి వారిని పూల పల్లకిపై ఉంచి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ఆలయ అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. పార్వేట ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. గుండ్లకమ్మ నది ఒడ్డున కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి స్వామి పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చక్కామాల కొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేజే నరసింహం తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.



మార్కాపురంలో పార్వేట ఉత్సవానికి తరలివచ్చిన భక్తుల

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం వెలుగొండస్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. రామదూత క్షేత్రంతోపాటు గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు క్యూకట్టారు. వెలిగండ్లలో అతిరాజు ఇంటి పేరు గల కుటుంబ సభ్యులు ఈ సంక్రాంతికి స్వగ్రామానికి చేరి సందడి చేశారు. అతిరాజు బాలనరసయ్య, ప్రభావతి దంపతుల కోరిక మేరకు కుమారులు, కూతుర్లు, కోడళ్లు, అల్లుల్లు, మనవళ్లు, మనవరాళ్లు, ముది మనవళ్ల విజయవాడ, కాకినాడ, గుంటూరు, గురజాల తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చారు.

తర్లుపాడు: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి పార్వేట ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి ఊరేగించారు. గ్రామోత్సవంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



కొనకనమిట్ల : వెలుగొండలో భక్తుల పూజలు

గిద్దలూరు రూరల్: కనుమ పండగ సందర్భంగా బుధవారం గిద్దలూరు పట్టణంలోని ఆలయాల్లో పార్వేట ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, షరాబ్ బజారులోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. సంక్రాంతి పండగ విశిష్టతను అర్చకులు వివరించారు.

కంభం: మండలంలోని లింగాపురంలో మంగళవారం రాత్రి గ్రామోత్సవాలు, పార్వేట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను తిలకించారు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వెంకటేశ్వర స్వామి

బేస్తవారిపేట: సంక్రాంతి సంబరాలను పందిళ్ల పల్లె, మోక్షగుండంలో గ్రామస్తులంతా ప్రత్యేకంగా నిర్వహించారు. మహిళలకు కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు, యువతకు ఆటల పోటీలు, కోలాటం, స్లోసైక్లింగ్ పోటీలు నిర్వహించారు. బుధవారం కనుమ సందర్భంగా గ్రామాల్లో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పార్వేటకు తీసుకొచ్చారు. జమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షిణల అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

కనుల పండువగా తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవం

మండలంలోని కోనపల్లెలో తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవలు కనుల పండువగా నిర్వహించారు. బుధవారం అశ్వవాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 102 అడుగుల విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నరసరావుపేట కళాకారులతో పాటకచేరి ఏర్పాటు చేశారు.

రాచర్ల: మండలంలోని ఆకవీడు, రాచర్ల, గుడిమెట్ట, అనుమలవీడు, గౌతవరం, జేపి చెరువు, యడవల్లి గ్రామాల్లో దేవస్థానాల ఎదురుగా కులుకు భజనలు, ముగ్గుల పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో పూజల అనంతరం ఉత్సవమూర్తులతో పార్వేట నిర్వహించారు.



అనుమలవీడులో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



తర్లుపాడులో వేణుగోపాలస్వామి పార్వేట ఉత్సవం



వెలిగండ్లలో సందడి చేస్తున్న 'అతిరాజు' కుటుంబం





బేస్తవారిపేట : పందిళ్లపల్లెలో కబడ్డీ ఆడుతున్న పెద్దలు, టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతున్న మహిళలు



గొట్లగట్టులో ఉత్సాహంగా కబడ్డీ ఆడుతున్న యువకులు

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



మార్కాపురం : బహుమతులు అందుకుంటున్న విజేతలు



తర్లుపాడులో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

విజేతలకు బహుమతుల పంపిణీ

మార్కాపురం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వాసవీ క్లబ్, లక్కీ షాపింగ్ మాల్ సంయుక్తంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. గాంధీ బజారులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జి.ప్రసాద్, హరిబాబు, సూరె శ్రీకాంత్, వాసవీక్లబ్ గవర్నర్ సూరె ఉమాదేవీ, గంగిశెట్టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు: సంక్రాంతి సందర్భంగా తర్లుపాడులో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలు ఎస్.పద్మజ, జి.సంధ్య, ఎం.మాలతి, సీహెచ్ కల్పన, వి ధనలక్ష్మికి ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతులు అందించారు. న్యాయనిర్ణేతగా ఎంపీపీ భూలక్ష్మి వ్యవహరించారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ బి.రామకృష్ణారెడ్డి, ఎస్సై బ్రహ్మనాయుడు, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, వేణుగోపాలస్వామి దేవస్థానం ధర్మకర్త విజయభాస్కర్, నెహ్రూ యువజన కేంద్రం అధ్యక్షుడు పుల్లయ్య, వాసవీ అన్నదాన సత్రం జాయింట్ సెక్రటరీ పి.జనార్దన్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జగన్‌బాబు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రంగరత్తమ్మ, స్థానిక నాయకులు కె భాస్కర్‌రెడ్డి, ఇ.వెంకటయ్య, జి.వెంకటేశ్వర్లు, సీహెచ్ శ్రీనివాసులు, రైతు సంఘం నాయకుడు పాపిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తూ కార్యకర్తలకు అండగా ఉండాలని పార్టీ బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పత్తి రవిచంద్రకు ఆ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. రవిచంద్రకు పదవి వచ్చిన సందర్భంగా అన్నా రాంబాబును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, తన పదవికి సహకరించిన పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, గిద్దలూరు ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



అన్నా రాంబాబును సన్మానిస్తున్న రవిచంద్ర

కరాటే, తైక్వాండోతో ఆత్మ రక్షణ

● స్వర్ణం సాధించిన విద్యార్థినికి సీఐ అభినందన

పొదిలి రూరల్: విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే, తైక్వాండో ఎంతగానో ఉపయోగపడతాయని పొదిలి సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా రేపల్లెలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన పొదిలి విద్యార్థిని షేక్ సాజియాను మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అభినందించారు. పదేళ్లలోపు బాలికల 27 కేజీల విభాగంలో పోటీ పడిన షాజియా నాలుగు రౌండ్లలోనూ సత్తా చాటిందని, జాతీయ స్థాయిలో రాణించాలని పలువురు ఆకాంక్షించారు. కరాటే మాస్టర్ చిన్న రాజును షాజీయా తల్లిదండ్రులు ఖాసీం షాహిద్, షాతాజ్ బేగం సన్మానించారు.



షాజియాను అభినందిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, మాస్టర్ రాజు

రాచర్లలో ట్రాఫిక్‌కు అంతరాయం



రాచర్ల బస్‌స్టాండ్ సెంటర్‌లో నిలిచిన వాహనాలు

రాచర్ల: కనుమ పండగ సందర్భంగా రాచర్ల బస్టాండ్ సెంటర్‌లో మాంసం విక్రయాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. మాంసం కోసం వచ్చిన వారు మోటర్‌సైకిళ్లను రోడ్డుకు ఇరువైపులా భారీ సంఖ్యలో పార్కింగ్ చేయడంతో కంభం–గిద్దలూరు మార్గంలో కార్లు, ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని మాంసం విక్రయాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పెదారికట్లలో ముగిసిన క్రికెట్ పోటీలు

కొనకనమిట్ల: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని పెదారికట్లలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో పెదారికట్ల స్పార్టాన్స్–యర్ర ఓబనపల్లి జట్లు తలపడ్డాయి. ఇరు జట్ల మధ్య నువ్వా నేనా అన్నట్లుగా సాగిన ఈ మ్యాచ్‌లో పెదారికట్ల స్పార్టాన్స్ జట్టు విజయం సాధించి మొదటి బహుమతి రూ.15 వేలను సొంతం చేసుకుంది. ద్వితీయ బహుమతి రూ.12 వేలను యర్ర ఓబనపల్లి జట్టు, తృతీయ బహుమతి రూ.10 వేలను ఇంద్ర లెవెన్స్ జట్టు గెలుపొందాయి. విజేతలకు దాతలు బహుమతులు అందజేసి అభినందించారు.



క్రికెట్ టోర్నీలో విజేతగా నిలిచిన స్పార్టాన్స్ జట్టు

800 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ

మార్కాపురం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సాయిబాబా మందిరంలో 800 మంది పేదలు, దివ్యాంగులకు బుధవారం సీఐ పి.సుబ్బారావు చేతులమీదుగా దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఏటా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా దుస్తులు, దుప్పట్లు అందజేసినట్లు మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు తెలిపారు. వందల సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, కోశాధికారి నాగరాజు, యువసేవ సమాజ్ అధ్యక్ష్య కార్యదర్శులు కృష్ణమోహన్, కరీం, రామడుగు గోపి, వెంకటేశ్వరరెడ్డి, కరీంబాషా, సాయిబాబా, మధు, పిచ్చిరావు, మేనేజర్ సతీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ సుబ్బారావు, పక్కన హరిహరరావు

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

గిద్దలూరు రూరల్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని దిగువమెట్ట గ్రామ సమీపంలో గల నల్లమల అటవీ ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. నంద్యాల జీఆర్‌పీఎఫ్ సిబ్బంది కథనం ప్రకారం.. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు, 5.6 అడుగుల ఎత్తు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు తెలుపు గోధుమ రంగు పట్టీలు గల టీషర్టు, నల్లని షార్టు ధరించి ఉన్నాడు. రైలు ఢీకొట్టడంతో మృతుడి ముఖం గుర్తుపట్టేందుకు వీల్లేకుండా ఉంది. మృతుడి వద్ద ఇతర ఏ ఆధారాలు లభించలేదు. ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని నంద్యాల జీఆర్‌పీఎఫ్ సిబ్బంది కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రెండు ఆటోలు ఢీకొని ముగ్గురికి గాయాలు

పొదిలి రూరల్: ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొనడంతో ముగ్గురుకి గాయాలయ్యాయి. ఈ సంఘటన పొదిలి మండలంలోని కాటూరివారిపాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పొదిలి నేతపాలేనికి చెందిన ఫోర్ వీలర్ ఆటోలో దాదాపు 15 మంది కూలీలు చీరాలలో పనికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆటో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొట్టింది. కాటూరివారిపాలేనికి చెందిన ముత్యాల రాములు, కొమరగిరి అంకమ్మరావు, యుద్ధం ప్రసాద్‌కు గాయాలు అయ్యాయి. వీరిలో తీవ్ర గాయాలైన రాములను ఒంగోలు తరలించారు. మిగిలిన వారికి పొదిలి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● ఎక్సైజ్ సీఐ అరుణకుమారి

కొనకనమిట్ల: గంజాయి, నాటు సారా తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పొదిలి ఎక్సైజ్ సీఐ అరుణకుమారి సూచించారు. మండలంలోని మునగపాడు గ్రామంలో మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్ఐ వి.సైమన్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ అరుణకుమారి